పోవుట, ఆరోగ్యవిషయమై చింత ఇటుల నేర్పడును. **16, 18, 20, 21, 23, 29** తేదులు శుభప్రదములు.

వృశ్చికం:—కుటుంబ నిర్వహణలో అసంతుష్టి, స్వవిషయమై సౌకర్యము లేకపోవుటచే చింత యేర్పడుట, ఉన్నచోటు మార్పు లేక ప్రయాణము చేయవలసివచ్చుట, అన్యుల సహాయమేర్పడుట, ఇతరుల కార్యములలో తల దూర్చవలసివచ్చుట, పుణ్యకార్యములలో ఖర్చు, అంతరంగిక చింత, గౌరవనీయుల స్నేహమేర్పడుట, మిత్రుల ఆదరణ ఇటుల కలుగును. **17, 20, 23, 27, 30, 31** తేదులు కార్యానుకూలములు.

ధనుస్సు:—వ్యాపారాభివృద్ధి ఆదాయాభివృద్ధి వీటికి సంబంధించిన విషయములలో సంతృప్తి యేర్పడుట, నౌకరీలో సౌకర్యమయిన మార్పు యేర్పడుట, ప్రయాణము తప్పనిసరియగుట, నిలబడిపోయిన వానివిషయమై చింత ఏర్పడి తొలగుట, కొరగాని వివాదలో పాల్గొనవలసివచ్చుట, కొత్తవారితో స్నేహము కుదురుట, ఇతరుల ఆదరణ, స్వవిషయమునను, లావాదేవీలలోను అనుకూలము లేర్పడుట, శుభసంగతులు వినవచ్చుట ఇటుల నేర్పడును. **18, 21, 24, 28, 30, 31** తేదులు శ్రేష్ఠములు.

మకరం:—మిత్రుల ఆదరణవల్ల వృత్తిలో అనుకూల్యమేర్పడుట, నౌకరీలో అధికారి ఆదరణ లభించుట, ప్రయత్నకార్యము అనుకూలించుట, గౌరవనీయుల ఆదరణ యేర్పడుట, వృత్తిలో అభివృద్ధి, కొందరితో విరోధపడవలసివచ్చుట, కుటుంబఖర్చు పెరుగుట, కొరగాని పనులలో పాల్గొనవలసివచ్చుట, వస్తుసేకరణవల్ల ఖర్చు పెరుగుట, తన్మూలమున చింత, ఆరోగ్యవిషయమై చింత, రహస్యశత్రువులవల్ల చింత ఇటుల కలుగును. **16, 18, 21, 24, 27, 29, 30** తేదులు శ్రేష్ఠములు.

కుంభం:—ప్రయత్నకార్యము సవ్యముగ సాగకపోవుటవల్ల చింత యేర్పడుట, గ్రామాంతరవార్తవల్ల చింత ఏర్పడుట, వృత్తిలో నిరుత్సాహము, మనస్సునకు నెమ్మది లేకపోవుట, బంధువుల క్లేశము, ఖర్చుపెరుగుట, ఇతరుల సహాయ మెదురుచూడవలసివచ్చుట, కుటుంబ నిర్వహణలో నూతన యేర్పాట్లు జరుగుట, నిర్బంధకార్యములో పాల్గొనవలసివచ్చుట, దేవకార్యములో పాల్గొనవలసివచ్చుట, వృత్తిలో సామాన్యాదాయము ఇటులనేర్పడును. **17, 19, 21, 24, 27, 29, 30** తేదులు సుఖప్రదములు.

మీనం:—వృత్తిలో అభివృద్ధి, ప్రయత్నకార్యము సఫలమగుట, ఆదాయమున్నను కుటుంబ విషయమై చింత, ఆరోగ్యభంగము, బంధువులవల్ల చింత, కొరగాని ఖర్చు, వృత్తిలో శ్రమ, చిక్కులు, నిరుత్సాహము లేర్పడి తొలగుట, అంతరంగిక చింత, ఇతరుల సహాయంవల్ల అనుకూల్యము, నౌకరీలో మార్పు, గౌరవనీయుల సందింపు, కుటుంబనిర్వహణలో సౌఖ్యము, తృప్తి ఇటుల నేర్పడును. **16, 18, 20, 22, 27, 29, 31** తేదులు మంచివి.

# సార్థకం

ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి

ఈమధ్యకాలంలో అనుకోనిపార్టీలు అనేకం ఉద్భవించిన మాట అందరికి విదితమే. అందులో అఖిల భారత సోమరిపోతులపార్టీ వకటి. ఎవరు యెక్కువ సోమరిపోతులో, వాళ్లనే అధ్యక్ష కార్యదర్శి స్థానాలకు యెన్నుకోవాలని యీ పార్టీ నియమావళి. ఆ నియమానుసారమే ఎన్నికలు జరిగినయి. అఖిల భారత పార్టీఅయినా, యీపార్టీని ఆంధ్రదేశంలోనే యెక్కువ అభిమానించారని తెలుస్తోంది. ప్రవేశరుసుము రెండు రూపాయ లయినప్పటికి, ముక్కోటి ఆంధ్రుల్లో కోటిన్నరకుపైగా ప్రాథమిక సభ్యత్వానికి దరఖాస్తులు పంపారట. ఆకోటిన్నరలో రెండు మూడు వందల్ని మాత్రం సభ్యులుగా చేర్చుకోవటానికి నిరాకరించారు. వాళ్లు పార్టీనియమాలకు బద్ధులుగా వుంటారనే నమ్మకం కార్యవర్గంలో లేకపోవటంవలన. దినదినాభివృద్ధి పొందుతున్న యీపార్టీని అంతర్జాతీయ పార్టీగా తయారుచెయ్యాలని మిగతా దేశాలకు ఆహ్వానాలు పంపిస్తే, వక్కదేశంనుంచి కూడ సంతృప్తికరమైన సమాధానం రాలేదు.

ఈ అఖిల భారత పార్టీ ప్రత్యేకసమావేశంలో తమ పార్టీ నియమావళిని తుచ తప్పకుండా పాటిస్తున్న వక ప్రముఖునికి ఘనసత్కారము చెయ్యాలని తీర్మానము చేశారు. ఆ ప్రముఖునికోసం, నిపుణులసంఘం, ఉత్తర దేశంనుంచి వెతకటం ప్రారంభిస్తే, చివరకు ఆంధ్రదేశంలో కాని, వాళ్లకు నచ్చినమనిషి దొరకలేదు.

ఇలాంటి అపూర్వ గౌరవము ఆంధ్రునకు రావటం, మనమంతా గర్వించాలసినవిషయం అంటూ ఉపన్యాసాలు దంచేసిన తర్వాత, ఆ ప్రముఖునికి బంగారుపతకం యివ్వటానికి కార్యవర్గం ఏకగ్రీవంగా నిశ్చయించింది.

కార్యవర్గ తీర్మాన పాఠమిది :—

"అఖిల భారత సోమరిపోతుల మహాసభ కార్యవర్గమువారు ఫలానావారిని ఏకగ్రీవంగా the most సోమరిపోతు అని నిర్ణయించి, వారికి మా కృతజ్ఞతకు చిహ్నంగా బంగారు పతకం యివ్వటానికి నిర్ణయించారు. వారు యీ ప్రత్యేక సమావేశానికి అనివార్యకారణాలవల్ల రాకపోవటంవలన, యీ కార్యవర్గసభ్యుని, వారిని వారి విలును బట్టి యిచ్చుటకు తీసుకురావాలసిందిగా కోరుతున్నాము." (కరతాళధ్వనులు)

ఆ కార్యవర్గసభ్యుడు వెళ్లి జరిగిన విషయమంతా ఆ ప్రముఖునికి చెప్పిరమ్మని ఆహ్వానించాడు.

'ఆ...ఇప్పుడెవ్వరు వస్తారయ్యా!...నువ్వు తీసుకొచ్చి యింట్లో పారెయ్యరాదూ...' అని సాగతీసుకుంటూ జవాబిచ్చాడు ఆ ప్రముఖుడు.

అప్పుడు ఆ కార్యవర్గసభ్యుడు, 'మీరు నిజంగా కనక అక్కడికే వస్తే మీకిచ్చే బహుమతి దండగే. ఇప్పుడు సార్థకం అయింది మీకిచ్చే బహుమానం' అన్నాడు.